క్లుప్తంగా

నేడు ప్రజా దర్బార్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, రాష్ట్ర ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ సోమవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉండవల్లిలోని తన నివాసం నందు నిర్వహిస్తానరి, ఉదయం 7 గంటల లోపు వచ్చిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని కార్యాలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మెల్లెంపూడిలో వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ మెల్లెంపూడిలో టీడీపీ గ్రామ అధ్యక్షు షేక్ నాగుల్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రజలకు వివిధ పరీక్షలు నిర్వహించారు. అమరా సుబ్బారావు, మంగళగిరి తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ ఖాసింబాబు, నాగుల్ మీరా, కంచర్ల కల్యాణ్, వెంకటప్పరెడ్డి, కరీమా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



తాడేపల్లిరూరల్ : నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గుంటూరులో నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి అన్నారు. ఆదివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో మున్సిపల్ కార్మికులతో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ ధర్నాను జయప్రదం చేయాలని ఈ నెల 30న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి ఉదయం 10 గంటలకు ధర్నాలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

దాడి కేసు నమోదు

తాడికొండ: ఆలయ పూజారిపై దాడి చేసిన కేసులో నిందితుడు కన్నెబోయిన వెంకయ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు. పొన్నెకల్లు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడుగా పనిచేస్తున్న కొండవీటి బాపేశ్వరశర్మను అదే గ్రామానికి చెందిన కన్నెబోయిన వెంకయ్య అనే వ్యక్తి ఆలయానికి వెళ్తుండగా దాడికి పాల్పడ్డాడు. వెనుక నుంచి వచ్చి అసభ్య పదజాలంతో దూషించి, బెదిరించడంతో పాటు తనపై దాడికి పాల్పడ్డాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

అలరించిన మహతీ స్వరసుధ సినీ సౌరభాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై ఆదివారం సాయంత్రం సినీ సౌరభాల కార్యక్రమం నిర్వహించారు. మహతి స్వరసుధ వ్యవస్థాపక అధ్యక్షురాలు పత్రీ నిర్మల ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయని, గాయకులు రాజ్యలక్ష్మి, అన్నపూర్ణ, ముకుంద ప్రియ, లక్ష్మి, కృష్ణ, నాగవల్లి, విజయశ్రీ, ప్రద్యుమ్న, వీరయ్య, సాయిబాబా, ఈశ్వరరావు తదితరులు అలనాటి సినీ సౌరభాలను వీనుల విందుగా ఆలపించారు. కీబోర్డ్‌పై ప్రసాద్, తబలాపై వెంకట్, పాడ్స్‌పై ప్రసాద్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్ వ్యాఖ్యానం చేయగా, కె.మదన్‌మోహనరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని ప్రయాణికుడి మృతి



తెనాలి రూరల్: రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలైన ప్రయాణికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఢిల్లీ–త్రివేండ్రం కేరళ ఎక్స్‌ప్రెస్‌లో ఈ నెల 27వ తేదీ రాత్రి ప్రయాణిస్తున్న సుమారు 30 నుండి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి చిలువూరు రైల్వేస్టేషనులో రైలు నుంచి ప్లాట్‌ఫాంపై జారిపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తొలుత స్టేషను సిబ్బంది 108లో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు పంపారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

వరద పోటు..ధరల ఘాటు

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజలకు తప్పని ఇబ్బందులు



కూరగాయలు

తాడేపల్లిరూరల్ : గడిచిన నెల రోజుల వ్యవధిలో అధిక వర్షాలు, వరదలు ప్రజలు చుట్టుముట్టాయి. ఎంతో మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఆ ప్రభావం నుంచి బయట పడేందుకు ఇప్పటికీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్మాణ రంగంలో ఇసుక కొరత ఏర్పడడంతో కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్లు దీనికితోడు ఒక్కసారిగా నిత్యావసర సరుకుల రేట్లు పెరగడంతో వారు అల్లాడిపోతున్నారు.

దసరా పండుగను ఎలా జరుపుకోవాలి అన్న సంశయంలో ఉన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నూనె ధర రూ.20 నుంచి రూ.45లు వరకు పెరిగింది. వెల్లుల్లి రూ.300 నుంచి రూ.400కి చేరింది. అల్లం కిలో ధర రూ.100 నుంచి 150 చేరింది. ఎండుమిర్చి రూ.200 నుంచి రూ.240కి పెరిగింది. పండగల సమయంలో ప్రధానమైన మినపప్పు కిలో రూ.135కు చేరింది. కందిపప్పు రూ.150 నుంచి రూ.175కు, పెసరపప్పు రూ.150 వరకు ధర పలుకుతోంది. ఉల్లి కిలో 60కి చేరింది. ఇవేకాకుండా నివాసాల్లో వంటకు ఉపయోగించే అన్ని పప్పు దినుసులు, ఇతర సామగ్రి ధరలు అమాంతం పెరిగాయి. బియ్యం 26 కేజీల బస్తా రూ.1,300 నుంచి రూ.1,500 వరకు ఉంది. ఇక కూరగాయలు విషయానికొస్తే.. ప్రతీది కిలో ధర రూ.50పైకి గానేకానీ, కింద లేదు. కూర వండుకోవాలంటే సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఒక సామాన్య కుటుంబంలో నలుగురు ఉంటే కూర వండేందుకు రూ.100 వరకు ఖర్చుఅవుతోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిత్యావసర సరుకులు

కూరగాయలు	కిలోధర (రూ.ల్లో)
బీన్స్	90
క్యాబేజీ	90
కీరదోస	60
బీర	50
వంకాయ	50
దొండ	40–60
బెండ	30
దోసకాయ	50
కాకరకాయ	60
క్యారెట్	70
మునగకాయ ఒకటి	15
నిమ్మకాయ ఒకటి	5
తెల్లగుమ్మడి	50
ఎర్రగుమ్మడి	50
టమాటా	50

కూరగాయల రేట్లు బాగా పెరిగాయి



కూరగాయల రేట్లు నాలుగు రోజుల వ్యవధిలో బాగా పెరిగాయి. ఏదైనా కేజీ తీసుకోవాలంటే రూ.50లు తప్పనిసరి. కూర వండాలంటే రూ.100లు ఖర్చవుతోంది. బియ్యం సాధారణ రకం కిలో రూ.50కు విక్రయిస్తున్నారు. ఈ సారి దసరా పండగకు సరుకులు తీసుకోవాలంటే కనీసం రూ.5 వేలన్నా ఉండాలి.

–మాధవి, పోలకంపాడు

రూ.500కు సంచి నిండడం లేదు



ప్రస్తుతం మార్కెట్‌కు రూ.500 తీసుకెళితే సంచికి సగం కూడా కూరగాయలు రావడం లేదు. సొరకాయ కూడా రూ.30కు విక్రయిస్తున్నారంటే.. . దరలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఉల్లి రూ.100కు చేరుకుంటోంది. సామాన్యులు ఇక రుచికరంగా తినడం సాధ్యం కాదేమో.

–శ్రీనివాసరావు, ఉండవల్లి

పెన్షన్‌లో సగం సరుకులకే..



ప్రస్తుతం పెరిగిన ధరలకు వచ్చే పెన్షన్‌లో సగం నిత్యావసర సరుకులకే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. మా ఇంట్లో ప్రస్తుతం ఎనిమిది మంది ఉన్నాం. ఏడుగురికి సరిపడా నిత్యావసర సరుకులు కావాలంటే రూ.5వేల పైనే ఖర్చువుతోంది. కూరగాయలకు వారానికి రూ.500 నుంచి రూ.600 అవుతోంది. పండగలు, ఆదివారం వస్తే ఆ రోజు ఖర్చు అదనం.

–పార్థసారథి, రిటైర్డ్ ఉద్యోగి

3 నుంచి దేవి నవరాత్రులు ప్రారంభం

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని శ్రీవిశాలాక్షీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి దేవీ నవరాత్రులు ప్రారంభించనున్నట్లు దేవస్థాన చైర్మన్ పి.వెంకటరెడ్డి , ఈఓ జె.శ్రీనివాసరావు సంయుక్తంగా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఉదయం గణపతిపూజ, మండపారాధన, కంకణధారణ, అఖండ దీపారాధన నిర్వహిస్తారని అమ్మవారిని స్వర్ణ అలంకారంలో అర్చనలు చేస్తారన్నారు. 4న బాలా త్రిపురసుందరిగా, 5న గాయత్రీమాత, 6న అన్నపూర్ణదేవి, 7న లలితా త్రిపురసుందరిగా, 8న మహాలక్ష్మీ దేవి, 9న సరస్వతి దేవిగా, 10న దుర్గామాత, 11న మహిషాసుర మర్దనిగా, 12 రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవార్లను అలంకరిస్తామని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు పలువురు దంపతులతో శ్రీచక్ర కుంకుమార్చనలు అష్టోత్తర, సహస్ర నామ పూజలు అర్చకులు రావూరి పూర్ణచంద్రశాస్త్రి, ఆంజనేయశాస్త్రి నిర్వహిస్తారన్నారు.

తీగను తొలగించిన విద్యుత్ సిబ్బంది



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయ సమీపంలో విద్యుత్ స్తంభానికి పిచ్చి తీగ అల్లుకుపోయి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గత శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనికి విద్యుత్ శాఖ ఏఈ పుల్లారెడ్డి స్పందించారు. సిబ్బందిని పంపించి విద్యుత్ స్తంభానికి ఉన్న పిచ్చి తీగను తొలగింపచేశారు.

పరిసరాల శుభ్రత బాధ్యత

మంగళగిరి: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ అలీం బాషా పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా ఆదివారం నగర పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..గాంధి జయంతి సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సాహి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్వచ్ఛ మంగళగిరి లక్ష్యంగా కృషి చేయాలన్నారు. పార్కులు, ఖాళీ స్థలాలను శుభ్రపరచి మొక్కలు నాటి, పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, డీఈ కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సిబ్బంది, కమిషనర్

డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న గుండిమెడ గ్రామంలోని డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం గుండిమెడలో నిర్వహించిన మహా సభకు సీపీఎం నాయకులు పల్లెకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కామ్రేడ్ సీతారాం ఏచూరి, పుచ్చలపల్లి సుందరయ్య, గుర్రం జాషువా చిత్రపటాలకు కంచర్ల జేమ్స్, ఇతర నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ గుండిమెడలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోందని, మురుగునీరు పారుదల లేక పోవడంతో దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. దళిత స్మశాన స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించాలని, గుండిమెడ గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం కాకుండా గ్రామంగా ఉంచాలన్నారు. ఈ మహాసభలో సీపీఎం సీనియర్ నాయకులు నాగపోగు విజయరాజు, పల్లె భార్గవ్, జెట్టి రాంబాబు, వెంకటరావు పాల్గొన్నారు.



ఏచూరి, సుందరయ్య చిత్రపటాలకు నివాళి

లంక గ్రామాల్లో 'మానవత' సేవలు స్ఫూర్తిదాయకం

రీజినల్ చైర్మన్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి: వరద బాధిత లంక గ్రామాలకు మానవత స్వచ్ఛంద సంస్థ అందించిన సాయం స్ఫూర్తిదాయకమని రీజినల్ చైర్మన్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కేవలం వాట్సాప్ సందేశానికి స్పందించి రూ.5 లక్షల సాయం అందించిన సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. మానవత సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో నిర్వహించారు. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సభ్యత్వం వెయ్యికి పైగా చేరేలా ముందుకు వెళదామని చెప్పారు. మానవత సంస్థకు కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు, మహిళా సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. డాక్టర్ రామ్‌చంద్ మాట్లాడుతూ తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లోని కృష్ణా తీరంలోని 12 లంక గ్రామాలకు చెందిన 950 బాధిత కుటుంబాలకు రూ.700 చొప్పున నిత్యావరాల కిట్‌ను, మరో 500 కుటుంబాలకు పొద్దుటూరు శాఖ సమకూర్చిన దుప్పట్లతో టవల్‌ను కలిపి పంపిణీ చేసినట్టు డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు. ఆర్థికసాయం అందించిన సభ్యులకు జ్ఞాపికలను బహూకరించారు. డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి మాట్లాడుతూ సంస్థ తరపున ఆరోగ్య శిబిరాల నిర్వహణను సూచించారు. ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్ ప్రతి ఒక్కరూ మరొకరిని సభ్యుడిని చేర్పించాలని కోరారు. గుంటూరుకు చెందిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ హెచ్ఐవీ బాధిత చిన్నారులకు నెలనెలా అందిస్తున్న పౌష్టికాహార వితరణలో పాలుపంచుకోవాలని ట్రస్ట్‌కు చెందిన రమేష్, కుర్రా శ్రీను విజ్ఞప్తిచేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థిని తుళ్లూరి తేజస్వినికి కూరపాటి రవీంద్రనాథ్, కళ్యాణి దంపతులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఆమె తల్లికి అందజేశారు. డిగ్రీ సెకండియర్ విద్యార్థి వలవరపు జనార్ధనరావుకు రూ.12 వేలను సంస్థ తరపున అన్నాబతుని శ్రీధర్ అందజేశారు. సమావేశంలో పి.వెంకట్, ముత్తేవి రవీంద్రనాథ్, పరిమి వాసు, డీవీ సోమయ్యశాస్త్రి, ఎస్వీ శర్మ, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, రోహిణి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందించిన సభ్యులతో కొత్త సుబ్రహ్మణ్యం, రామ్‌చంద్

గుండె జబ్బులపై వాక్‌థాన్

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు పెరిగిపోతున్న నంబర్ వన్ కిల్లర్ డిసీజ్ గుండెజబ్బుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రేష్ట హాస్పిటల్స్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ జి.నాగార్జున అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లోని శ్రేష్ట హాస్పిటల్‌లో గుండె ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కోసం వాక్‌థాన్ నిర్వహించారు. వాక్‌థాన్‌ను ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ వై.లక్ష్మణస్వామి ప్రారంభించారు. గుండెజబ్బు వైద్య నిపుణులు నాగార్జున మాట్లాడుతూ గుండె ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారంలో కనీసం ఐదు రోజులపాటు ప్రతిరోజూ అరగంట సేపు వ్యాయామం చేయాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, హార్ట్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రూ.1,499కే ప్రత్యేక హార్ట్ ప్యాకేజీ, అక్టోబర్ 9 వరకు అమల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుస్మిత, డాక్టర్ హేమసుందర్ పాల్గొన్నారు.



వేర్వేరు చోట్ల ఇద్దరు యువకుల ఆత్మహత్య

నగరంపాలెం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళదాస్‌నగర్ రెండో వీధికి చెందిన బి.ప్రసన్న, మాణిక్యరావు(34) భార్యాభర్తలు. వీరికి కుమారుడు. మాణిక్యరావు పెయింట్ పనులకు వెళ్లేవాడు. అతడి అమ్మ జయమ్మకు అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రిలో చూపించాడు. అయితే తల్లికి చికిత్స నిమిత్తం సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. ఈ క్రమంలో చిలకలూరిపేటలో భార్య పేరుపై ఉన్న టిడ్కో ఇల్లు తనఖా పెట్టాలనే భార్యతో గొడవ పడ్డాడు. శనివారం రాత్రి భార్య కుటుంబ సభ్యులు వచ్చి మాణిక్యరావుతో గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన అతను ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్షలు నిమిత్తం జీజీహెచ్ శవాగారానికి తరలించారు.

ఉరేసుకుని..

చున్నీతో ఉరేసుకుని ఒకరూ మృతిచెందారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటుకూర్ రోడ్డు దర్గా మాన్యంకు చెందిన యు.నాగేశ్వరరావు (33)తో కొల్లిపరకు చెందిన తిరుపతమ్మకు 2013 లో వివాహమైంది. వీరికి కుమార్తె. భార్యాభర్తల మధ్య కుటుంబ విభేదాలు వచ్చి వేర్వేరుగా ఉంటున్నారు. కూలీ పనులకు వెళ్లే నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీ తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మృతిపై భార్య ఆదివారం లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొలనుకొండలో ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్ : కొలనుకొండలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ విచ్చేసి, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మంది పేదలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వైద్యులు తమ సేవలను అందించడం అభినందనీయమన్నారు. మానవ సేవా సంస్థ అధ్యక్షులు వంగర సురేష్ మాట్లాడుతూ వైద్యులు వంశీ, రవిబాబు, శ్రీకర్, శశిధర్, మాధురి, వినోద్, కృష్ణలీ, జయకృష్ణ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారని తెలిపారు. సుమారు 800 మందికి బీపీ, షుగర్ పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించామన్నారు. కాట్రగడ్డ శివన్నారాయణ, శంకర్‌బాబు, నూతక్కి శ్రీనివాసరావు, సామాల నాగేశ్వరరావు, హనుమాన్ బాబు, విజయ్ మహేంద్ర, మానవ సేవా సంస్థ సభ్యులు హనుమాన్, రవి, బాలకృష్ణ, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

'నవరసాల నటుడు నందమూరి' శతక పుస్తకావిష్కరణ

తెనాలి: బెంగళూరులోని సీపీ బ్రౌన్ సేవా సంస్థ నిర్వహించిన విశ్వ శతక స్పర్ధలో తృతీయ బహుమతిని అందుకున్న 'నవరసాల నటుడు నందమూరి' శతక పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం తెనాలిలో ఆవిష్కరించారు. స్థానిక కొత్తపేటలోని కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో డీఎల్ కాంతారావు సమావేశపు వేదికపై జరిగిన సభకు సాంఘిక సంక్షేమ గురుకులాల విశ్రాంత ప్రిన్సిపాల్ జి.రాజశేఖర్ అ ధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రాయప్రోలు జగదీశచంద్రశర్మ రచించిన శతక పుస్తకాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వవిఖ్యాత నటసార్వభౌమగా గుర్తింపును పొందిన ఎన్టీరామారావును స్మరించుకున్నారు. తెనాలిలో ఎన్టీరామారావు శత జయంతి ఉత్సవాలను ఏడాది నిర్వహించినట్టు గుర్తు చేశారు. తన సినిమాలతో ఎన్టీఆర్ చిరంజీవిగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాల్లో ఉంటారని చెప్పారు. ప్రముఖ సాహిత్యకారుడు బీరం సుందరరావు పుస్తక సమీక్ష చేశారు. చెతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ప్రముఖ కవి నగ్నముని, రచయిత పాలడుగు ఆనందయ్య, కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ డీఎల్ కాంతారావు, రామరాజు కేశవరావు ప్రసంగించారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీమంత్రి ఆలపాటి

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌కు ప్రోత్సాహక నగదు బహుమతులు





కండక్టర్ వెంకటేశ్వరమ్మ, డ్రైవర్ నారాయణకు నగదు అందజేస్తున్న డీఎం రాజశేఖర్

తెనాలి రూరల్: ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్న తెనాలి ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్, డ్రైవర్లకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అభినందించి ప్రోత్సాహక నగదు బహుమతుల్ని అందజేశారు. తెనాలి నుంచి భట్టిప్రోలు వెళ్లే ఆర్టీసీ బస్సులో పని చేస్తున్న కండక్టర్ డి. వెంకటేశ్వరమ్మ ప్రయాణికులతో మమేకమై చక్కగా పలకరిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ వి.వి. నారాయణ ఈ మార్గంలో బస్సును ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా నడుపుతున్నారు. వీరి సేవలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వై. చింపయ్య, జి. రేణుకయ్య ముగ్ధులయ్యారు. ఆదివారం తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లిన వీరు డిపో మేనేజర్ రాజశేఖర్ సమక్షంలో వెంకటేశ్వరమ్మ, నారాయణలను అభినందించారు. డీఎం చేతులమీదుగా ఇద్దరికీ రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతుల్ని అందించారు. తమ సేవల్ని గుర్తించినందుకు డిపో సిబ్బంది చింపయ్య, రేణుకయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

శారద సర్వీస్ సొసైటీ వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ డీ 3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్నట్టే చివరి ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ ఎస్ భవనంలో ఏర్పాటుచేసిన శిబిరానికి వివిధ గ్రామాల్నుంచి రోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వారికి అల్పాహారం అందించి షుగరు, బీపీ, బీఎంఐ పరీక్షలను చేశారు. అవసరమైనవారికి ఈసీజీ, ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. నెల రోజులకు సరిపడా బీపీ, షుగర్, కాల్షియం, బలం బిళ్లలను అందజేశారు. జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



